ఆరో పెగ్గు వేసుకుంటున్న మధుసూధనరావు గారి కళ్ళు, బైట మెరుపు కాంతితో ఆకలితో వున్న పులి కళ్ళలా ఎర్రగా మెరుస్తున్నాయి.

మాటలు తూస్తూ, నెమ్మదిగా, బరువుగా, అంతా వివరించిన తరువాత రాధ, "అతనికీ యిష్టమే, మీ అంగీకారం, ఆశీర్వాదాలు కావాలిడాడీ" అని దేవుడిలా వున్నా రాయీ, రాతిలో వున్న దేవుడూ కరిగేలా ప్రార్థించింది అతన్ని.

మిలియనేర్ మధుసూధరనావుగారి కళ్లు ఇంకెంచె ఎరుపెక్కేయి. వాట్ (VAT) 60 బాటిలు ఎంతో మెజిస్టిక్‌గా పట్టుకొని, ఎడమ చేతిలోని గ్లాసులో ఏడో పెగ్గు పోసుకుంటూ వుంటే తొలిసారి అతని చెయ్యి వణికింది. అతను రాధ వేపు సూటిగా చూస్తూ సిప్ చేసిన గ్లాసు టేబిలు మీద పెట్టేసి, సో నువ్వా కుర్ర డాక్టర్ని పెళ్ళాడతానంటావ్. అవునా, కమాన్. లెటజ్ టాక్ ఫ్రాంక్లీ. నీ వయస్సెంత? మహా వుంటే యిరవై, ఇంక నువ్వు చూసిన ప్రపంచం ఎంత స్విట్జర్లాండులో ఐసుగుట్టలు, లండన్లోని స్కూలు బిల్డింగు, మనిల్లు, అంతేనా, ఇంక మనుకున్న ఆస్థి ఏ మాత్రం వుంటుందోనువ్వు అంచనా వెయ్యగలవా? పన్నెండు లక్షల పైనే అని నా జ్ఞాపకం. రామనాథం డాక్టరై నెలకెంత తేగలడు? అయితే ఆరువందలు, కాకపోతే వెయ్యిలోపు. "నా ఆస్థి అతనిది కాదా?" అనడగుదామని నీకుంది. ఈ కాలంలో ఎవరి ఖర్మ వాడిది. ఎవడి పాపం వాడిది. అలాగే ఎవడి డబ్బు వాడిదే. మొగుడు పెళ్ళానికిస్తున్నాడా? తల్లి పిల్లలకి పెడుతోందా?

చీపురుకట్టతో తుడుచుకుంటాం గాని, ఫ్లవర్ వాజులో పెడతామా? పెట్టం. గొప్పవాడు కొన్నిపరిస్థితుల్లో బీదవా డౌతాడేమో గాని బీదవాడు ఏ పరిస్థితుల్లోను గొప్పవాడు కాడు. కాలేడు. ఇంకకులం అంటావా? డబ్బుతోనే కులం కూడా వస్తుంది. డబ్బులేక పోతే వున్న కులం కూడా పోతుంది. ఇదీ ఇప్పటి పరిస్థితి. అంటూ సిప్ చెయ్యడం కోసం ఓ క్షణం ఆగేరు.

అతని మాటలు వింటున్న రాధకి తన కింద భూమి పగిలి తను సీతాదేవిలా భూమిలోకి దిగిపోతున్నట్టూ, తన బంగళా గోడల పగిలి తను సజీవ సమాధి అయిపోతున్నట్టు అన్పించింది.

"కాబట్టి నువ్వు తీసుకున్న నిర్ణయానికి నిన్ను అభినందిస్తున్నాను. నిన్ను చూసి గర్వపడుతున్నాను. విష్ యు గుడ్ లక్" అంటూ ముగించేరు.

అప్పుడు కూడా అతని మాటలు విన్న రాధకి తన పాదాల కింద భూమి పగిలిపోతున్నట్లు, తన బంగళా గోడలు కూలిపోతున్నట్టు అన్పించింది.

"కాశీలో శేష జీవితం భగ్న ప్రేమికురాలిగా గడుపుదామన్న ఒక్క కోరికా కూడా తీరలేదు" అని కుమిలి పోయింది.

**(ప్రతిభ వారం, 3.5.1968)**

# అసలు లేని వడ్డీ

"వాడి పాత అప్పు యీ జన్మలో తీర్చను. ప్రతి ఫస్టుకీ వడ్డీ వాడి మొహాన్ని కొట్టేస్తున్నాను వాడిక్కావలసింది వడ్డీ మనక్కావలసింది అసలు"

పెళ్ళి కూతురి మొగలి జడలా మెరిసిపోతోంది పంటకాలువ.

అందులో విరిసిన వెండిపువ్వులా వెలిగిపోతున్నాడు చంద్రుడు.

అద్దాల్లో పిల్లకి పాలిస్తున్న చల్లని తల్లిలా వున్నది పల్లాన వున్న గున్నమామిడి.

దూరాన పైటలా ఎగురుతున్న తెరచాపకు స్వాగతం పాడుతోంది అవలిగట్టు సరుగుడుతోట.

ఎప్పుడూ ఇలా ఉండిపోతే బాగుండునన్నట్టుంది ప్రకృతి.

కాని దారితప్పిన పిట్టలా మూలిగేడు కాలివంతెన మీద నున్న విశ్వనాథం. అతనికిమటుకు, ప్రకృతి, పచ్చగడ్డిలో పడుకొని ఆకాశంలోని చుక్కల్ని చూస్తూ పకపకనవ్వే పడుచులా వున్నా ఒకటే–మెట్టపొలంలోని కిందటేడు దిష్టి బొమ్మలా ఉన్నా ఒకటే. పరిసరాలకు అతని మీద ప్రభావం పోయి ఎన్నేళ్ళయిందో అతనికే గుర్తులేదు.

నేనూ ఒక మనిషినే. నాకు మనిషిగా బతికే హక్కూ నవ్వే అర్హతా ఉన్నాయి. అయినా సంసారపు రాతి పర్వతం క్రింద పడి, నేనూ ఒక మనిషినే అన్న అంశమే మర్చిపోయే దీనస్థితికి ఎందుకు దిగజారిపోయేను? ఏడుపు ఒక్కటేనా ప్రభూ, నువ్వు మాకిచ్చే మానవానుభవం అని ఆలోచించే మానసిక శక్తి కూడా లేకపోయింది అతనికి.

చింకిగా, బరువుగా అయిపోయిన పాత ఖద్దరు కోటులో – వాసనపోయిన అత్తరు మరకలా కనిపిస్తుంది జీవితం అతనికి.

పరిగెత్తే కారుమీదపడి తుళ్ళే వెన్నెలా, ఖరీదైన హోటలు గదిలో అద్దం మీద పడే విద్యుత్కాంతీ అతనికి సూదుల్లా గుచ్చుకుంటాయి.

అతనూ ఒకప్పుడు-అంటే అల్లప్పుడెప్పుడో - ఖరీదైన హోటళ్ళకే వెళ్ళేడు. మడత నలగని సూట్లే వేసుకునే వాడు. తన జీవితం విరిగని వెండికలలా కారు వెనక సీట్లోనే ఖరీదైన జోళ్ళల్లోనే గడిచిపోతుందని సకారణంగానే ఆశించేవాడు.

ఎప్పుడూ చెరగనట్టు కనిపించిన అప్పటి జీవితపు మొఖముల్ రంగులు ఎప్పుడో వెలిసిపోయేయి. ఆ మరుపే మంచిదని పిస్తోంది అతనికి. లేకపోతే కాలేజీలో తను స్పోర్ట్స్ ప్రైజులు పుచ్చుకున్నప్పుడు పిల్లలు కొట్టిన క్లాప్స్ గుర్తుకొచ్చినప్పుడు పాల కోసం ఏడవడానిక్కూడా శక్తి లేని పసిపిల్లలా నీరసపడిపోతాడు అతను.

ఆ జీవితానికి భగ్గుమని నిప్పు పెట్టింది తన దత్తత చెల్లదన్న మూడో కోర్టు తీర్పు. తన తల్లికి దత్తత చేసుకునే అధికారం లేదనీ, ఉన్నా ఆమె తనని దత్తత చేసుకోలేదనీ, చేసుకున్నా ఆ దత్తత చెల్లదనీ, చెల్లినా ఎప్పుడో చనిపోయిన తన దత్తత తండ్రి తాలూకు ముప్పై ఎకరాల్లో మూడు గజాలు కూడా తనకి రావనీ ఇచ్చిన ఆ తీర్పు, వెన్నెల ఏట్లో వెండినావలో వెళ్తున్న తన జీవితాన్నీ, తననీ పీకేసి, పులి కోరల మధ్యా, పాము కోరల మధ్యా పడేసింది. తీర్పునాటికి లక్ష్యపెట్టని బి.య్యే. తీర్పు తర్వాత పూర్తి చేసి పదిమంది కాళ్ళూ పట్టుకుంటే దొరికిందల్లా ఎల్‌డిసీ ఉద్యోగం. అది ఉద్యోగం కాదు. ఊడిగం, ముదరగా, ముదరగా యు.డి.సీ. అయ్యేడు అతను. రిటైరయ్యే లోగా హెడ్ గుమాస్తా అయి, తను చెయ్యని తప్పులక్కూడా చీవాట్లు తినొచ్చు.

ఇన్నైనా తన మట్టుకి తనకి చింతలేదు. తను మొగాడు కాని, పాతికేళ్ళ క్రింద నాగవల్లి కుండలా నిండుగా కాపురానికి వచ్చి, నిత్యం ఏడిచే ఓటికుండలా అయిపోయిన కమలని చూస్తేనే, ఎవరో అదృశ్య శత్రువు నిప్పుల చేత్తో వెనక దెబ్బకొట్టినట్టుంటుంది. కాపరానికి వచ్చిన రోజుల్లో సన్నగా, పొడుగ్గా, నల్లచీర కట్టుకున్న దంతపు బొమ్మలా ఉండేది ఆమె. వయసొచ్చినప్పటికీ సన్నగానే ఉంటుంది. ఇప్పుడు కూడా ఆమె నవ్వితే పూలజల్లు పడ్డట్టే ఉంటుంది.

కాని.... ఆమెనవ్వడం ఎప్పుడు? కట్నాలూ కానుకలూ సరిగ్గా జరపలేదని నిత్యం పెద్దకూతురి కళ్ళల్లో నీరు తెప్పించే కనకారావుని తల్చుకుంటే ఏ తల్లి చావుని వెంటనే కోరుకోదు?

నిజమే అనుకున్న కట్నం అంతా ఇవ్వలేకపోయిన మాట నిజమే. గత సంక్రాంతికి బట్టలు పెట్టలేకపోయిన మాట నిజమే. కాని కనకారావుకి తన పరిస్థితులు పూర్తిగా తెలుసునే. పెరిగిన బాధ్యతలూ ఎదగని అవకాశం ఎగిరి పోవడానికి పిల్లలు చేసే రెక్కల చప్పుడూ చాలని గూడూ కట్టుకొని - చిరుగులూ - నీరు యింకిన కళ్ళు ఎరుపూ-అన్నీ-అన్నీ తెలుసునే కనకారావుకి, తను ఎన్ని పస్తులు పరమాన్నంగా స్వీకరించి రామం గాడిని మెడిసిన్ చదివించాడో - చదువు అయ్యేక వాడు తన స్వార్థం కోసం, తనకి నచ్చిన దానికోసం ఎంత క్రూరంగా ఎత నిర్దయంగా తనని అప్పుల మొసళ్ళకి వదిలేసి అవతలి గట్టుకి వెళ్ళిపోయేడో కూడా తెలుసుకొనే కనకారావుకి కాని... కాని ఏ మనిషీ మరొకణ్ణి హింసించే అవకాశం వస్తే వదులు కోడేమో!

ఏమైతేనేం. ఈ సంక్రాంతికి ఫరవాలేదు. చీమూ, నెత్తురూ కలిసి ఇప్పటికి డెభై ఐదు రూపాయలయ్యేయి. ఈ మూణ్ణెల్లలో ఆ పాతికా పూర్తి చేసేస్తే కనకారావు గురించి ఒక సంవత్సరం మంచిగా ఆలోచించవచ్చు.

“ఛీ, ఛీ ఏం మనుషులు!” అని మనసులోనే తిట్టుకొని కాలుస్తున్న సిగరెట్టు కాలువలోకి విసిరేసేడు విశ్వనాథం.

బాత్‌టబ్‌లో పసిపాపలా నవ్వుతున్న చంద్రుడు విరిగి వెయ్యి ముక్కలైపోయేడు. విశ్వనాథం యింటివేపు తిరిగేడు.

భూమి చెంపమీది కన్నీరులా కాలువ కారుతూనే ఉంది.

❖ ❖ ❖

విశ్వనాథం భోంచేస్తున్నప్పుడు వాకిట్లో లాంతరు పక్కని ఆఖరివాడు, భారతీయుల సౌభాగ్యం కోసం ఆంగ్లేయులు ఎందుకు పాలించవలసి వచ్చిందో అర్థం కాక మూడు సార్లు చదివేడు. మెడికల్ మార్కులు వచ్చినా బి.య్యే కూడా చదువు కోడానికి నోచుకొని రెండో కూతురు పక్కింటివాళ్ళ పాతపత్రిక తిరగేస్తోంది. మిగతా యిద్దరు కుమార రత్నాలూ విశ్వనాథం మొహం మీద సిగరెట్ పొగ ఊదే ధైర్యం చాలక వీధిలోకి వెళ్ళి నట్టున్నారు.

భోంచేసి చెయ్యి ఒత్తుకుంటూ వీధి అరుగుమీద కూలబడ్డాడు విశ్వనాథం.

ఎదుటి చూరుకింద వంచినతల ఎత్తకుండా నిలబడి ఉందొక గాడిద.

పక్కింటి పక్షవాతం వాడు పెళ్ళాన్ని తిడుతూనే ఉన్నాడు.

కన్నీరు యింకిపోయిన కన్నులా మందుతోంది మూడో యింటిలోని ఒక హరికెన్ లాంతరు.

చలికి, మూలిగి యింకా గట్టిగా ఉండచుట్టుకుపోయింది తల్లి పోయిన వీధి కుక్క పిల్ల.

విశ్వనాథం యింకో అయిదేళ్ళలో రిటైరు అయిపోతాడు. ఆ తర్వాత ఆలోచించే ధైర్యం లేకపోయింది విశ్వనాథానికి. జీవితాన్ని ఆ రాత్రి ఆఖరుసారిగా తిట్టి అతను పడుకోబోడానికి లేవబోతూ వుంటే వచ్చేడు సత్యనారాయణ. అతను విశ్వనాథం తోటి గుమాస్తా.

అతను సన్నగ్గా, నల్లగా, పొడుగ్గా వుంటాడు. అతని మొహాన్ని ఎప్పుడూ రెండు రోజుల గడ్డం పెరిగి వుంటుంది.

అతని భుజాల మీద ఎప్పుడూ మూడు జన్మల దరిద్రం పేరుకొని వున్నట్టుంటుంది.

కాని మనిషి నిజాయితీపరుడు కావడం వల్ల ఎప్పుడూ ఎవరో అదృశ్య శత్రువుతో యుద్ధం జరపుతున్న వాడిలా బెదురు బెదురుగా వుంటాడు.

అబద్ధమాడడన్న కీర్తి అతను కష్టపడే సంపాదించు కున్నాడు.

అతను చొరవగా విశ్వనాథం దగ్గర్నుంచి సిగరెట్లూ అగ్గిపుల్లా లాక్కుని, బాబూ విశ్వనాథం "చల్లకొచ్చి ముంత దాచేవాడిని కాను. అలాగని ముష్టికి బనారసు సంచీ పట్టుకురావలసిన వాడినీ కాను. నాకు అర్జంటుగా డబ్బు కావాలి. నీ దగ్గరెం తుంది?" అని ఊపిరి సలపనివ్వ కుండా అడిగేసి, సిగరెట్లు అంటించి ఇంకా వెలుగుతున్న అగ్గిపుల్ల వెల్తురులో విశ్వనాథం కళ్ళలోకి చూసేడు.

దేవుఁడు కళ్ళలోకి చూసినా దమ్మిడీ వుందని వప్పుకునే పరిస్థితిలో లేడు విశ్వనాథం.

అంచేత సత్యనారాయణే నాకు తెలుసురా బాబూ నువ్వూ ఒక జోగివేనని. కాని నీకూ నాకూ వున్న భేధమేఁవిటంటే నువ్వు పఠానుగాడి అప్పు తీర్చేసేవు. నేను తీర్చలేదు. నువ్వు అడిగితే వాడిస్తాడు. నేనడిగితే పీక నొక్కేస్తాడు.

"కాబట్టి నువ్వు వాడి నడిగి ఎక్కువొద్దు – ఒక్క యాభై పట్రా–వాడెక్కడ దొరుకుతాడో నీకు చెప్పనక్కర్లేదు. వాడి నెక్కడ తప్పించుకోగలనో చేతనైతే నాకు చెప్పు. కాని రేపు సాయంత్రాని కల్లా ఒక యాభై తెచ్చిపెట్టు"

"వాడి పాత అప్పు ఈ జన్మలో తీర్చను. ప్రతి ఫస్టుకీ వడ్డీ వాడి మొహాన్ని కొట్టేస్తున్నాను. వాడిక్కావల్సింది వడ్డీ. మన క్కావల్సింది అసలు"

"ఈ అప్పు మాత్రం–యిదుగో ఈ డిసెంబర్లో మా ఆడదాని శిస్తులు రాగానే అణా పైసలతో తీర్చేస్తాను. కాబట్టి బాబ్బాబూ కాదనకు. ఇవి కాళ్ళే అనుకో" అని క్షణం తటపటాయించి కాళ్ళే పట్టుకున్నాడు. విశ్వనాథం కాళ్ళకి కితకితలు వేసినా చలించ లేదు.

అంచేత సత్యనారాయణే మళ్ళీ ప్రారంభించేడు, ఎల్లుండి మా అల్లుడు వస్తున్నట్టు ఉత్తరం వచ్చింది. ఇన్నేళ్ళకి మీ మేన గోడలి కాపురం చక్కబడేటట్టుంది. దాని మొగుడు వచ్చిన వెంటనే దాన్ని తీసుకొనిపోతాట్ట"

ఇలాటప్పుడు కూడా నీ టిక్కట్టూ నీ పెళ్ళాం టిక్కెట్టూ కూడా నువ్వే కొనుక్కో అంటే – నన్నూ నా కూతుర్నీ కూడా తనెక్కబోయే రైలుకిందే తోసేసి మరీ వెళ్ళిపోతాడు.

"కాబట్టి బాబ్బాబూ–ఈ ఆపద ఈ అవసరం ఎలాగైనా గడిపిపెట్టు. ఈ బాకీకీ, రెండేళ్ళ నుండి నువ్వు నాకివ్వ వలసిన బాకీకీ ఎటువంటి సంబంధం లేదు. నన్ను నమ్ము. నేను దేవుడి లాంటివాణ్ణి. మాటివ్వను గాని, యిస్తే మీరను.

"నువ్వు మాటిస్తేగాని నేను వెళ్ళను. లేకపోతే యిక్కడే పీక పిసుక్కు ఛస్తాను" అని ఆగేడు.

అతని కూతురి ప్రసక్తి వచ్చేసరికి విశ్వనాథం మనసు విక లమైపోయింది. ఐదేళ్ళ కింద ఆమె తొలికాన్పుకి వచ్చింది. అప్పుడు చేసిన జబ్బులో మంచంలో నీడ – ఆ నీడలో ముత్యాలు కక్కే చేపల్లా వున్న ఆమె కళ్ళూ– మెడలో మాయమైన బంగారు గొలుసు–కాలికి యినప సంకెల–విశ్వనాథంగారికి గుర్తొ చ్చాయి. అప్రయత్నంగా అతనికి తన పెద్ద కూతురు గుర్తు కొచ్చింది.

"సరే రేపురా" అని విశ్వనాథం అన్నాక, "ఏం బతుకులురా – బాబూ మనవి. మనకంటే కుక్కలునయం" – అంటూ సత్య నారాయణ లేచేడు.

ఇంటికెళ్తున్న సత్యనారాయణకి నవ్వూ, ఏడుపూ ఒక్కసారి వచ్చేయి. తనకి అర్జంటుకి యాభై రూపాయలు కావలసిన

మాట నిజమే. కాని కూతుర్ని కాపరానికి పంపడానికి మాత్రం కాదు. దానికి కావల్సిన డబ్బు తన దగ్గరుంది. కాని అన్న మాట తప్పకుండా వెంకట్రావు అప్పు తీర్చడానికి మాత్రం తన దగ్గర యాభయ్యా లేవు.

ఇంటికెళ్ళిన సత్యనారాయణకి కాబూలీవాడూ, కాల యముడూ ఒక్క రూపంలో ప్రత్యక్షమైనట్టు కనిపించేడు వెంకట్రావు. కాని వెంకట్రావుకి మాత్రం కాబూలి వాడు కండలూ, కాలయముడి ఎనుబోతూ కూడా లేవు. అతను పిసికి పారేసిన ట్యూబులా అతి నీరసంగా వుంటాడు, తన కడుపున పుట్టిన వారి శత్రువు తనేనేమోనన్న భయం రోజు రోజూ అతనిలో పెరిగి పోతున్న మనిషిలా, అతను ఎవరితోనైనా అతి ఎపోలజిటిక్‌గా మాట్లాడుతాడు. ఎవరూ అతనితో మాట్లాడకుండా వున్నప్పుడే అతనికి హాయిగా వున్నట్టుటుంది. అతను ఎవరితో ఏ విషయం మాట్లాడు తున్నా దేవుడి మంచితనంలో నమ్మకం తగ్గిపోతున్న మనిషిలా – ఏదో చెప్పలేని బాధ అనుభవిస్తాడు. అతి సామాన్య విషయాలు కూడా ఒక పట్టున అతనికి అర్థం కావు. తన పెళ్ళి కాని కూతురు పాతికో ఏటే ఎందుకు లేచిపోయిందో – తన రెండో కూతురికి ఎందుకు సంబంధాలు రావడం లేదో – తన భార్య నూతిలో పడి ఎందుకు చచ్చిపోయిందో – తనని పట్టుకున్న దగ్గు ఎందుకు తగ్గదో – అతనికి తెలియదు. అతను ఎలిమెంటరీ స్కూలు మేష్టరు.

సత్యం, నువ్వే కాపాడాలి. రేపు మా పెద్దాడికి టెర్మ్‌ఫీజు కట్టాలి. బాబ్బాబు, ఒక్కయాభై తక్కువొచ్చేయి. కాస్త సర్దిపెట్టేవా పుట్టినే యిచ్చేవనుకుంటాను కాదనకు, అని అతను మరి మాట్లాడలేకపోయాడు.

"సరే రేపురా" అన్నాడు సత్యం.

"నేను ప్రమాణం చేస్తున్నా. నువ్వు సర్దితే పాత అప్పు కింద జమ కట్టుకోను. ఈ ఫస్టుకి దసరాకట్నాలొస్తాయి. నీ బాకీ తప్ప కుండా తీర్చేస్తా. నువ్వూ పిల్లలవాడివే నాకు తెలుసు" అంటూ ఏడవడానికి సిగ్గుపడుతున్న వాడిలా ఆగిపోయేడు.

"రేపు రమ్మన్నానుగా" అని సత్యం విసుక్కున్నా అతన్ని అమాంతం కౌగిలించుకోందే వెంకట్రావు కదలలేదు. వెళ్తూ వెళ్తూ "నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు సత్తెం" అని కృతజ్ఞత తెలియపర్చేడు.

"అంటే తీసుకోబోయేది తీర్చవేమిటి?" అని సత్యం అన్నప్పుడు అతను విస్తుబోయేడు.

❖ ❖ ❖

ఊరవతల ఒక గుట్ట

ప్రియురాలి నడుమును చుట్టిన ప్రియుని చెయ్యిలా దాని చుట్టూ కాంక్రీటు రోడ్డు.

గుట్ట మీద రాజభవనంలా కలెక్టరాఫీసు, దాని ఎదుట మైదానంలో లేతగా, సన్నగా ఎదిగిన ఆడపిల్లల్లా అక్కడా, అక్కడా సరుగుడు చెట్లు.

సాయంత్రం ఎండ ఉండవలసినంత వెచ్చగానూ, సముద్రపు గాలి చల్లగానూ వున్నాయి.

గుట్టమీద నిల్చున్న విశ్వనాథానికి సైకిళ్ళ మీద గుట్ట దిగి పోతున్న మనుషులంతా విషపు వరదకి భయపడి పారిపోతున్న వాళ్ళలా కన్పించేరు. కొంతసేపటికి అంతా వెళ్ళిపోయేరు – కాబూలీ, విశ్వనాథం తప్ప. దూరంగా కేంటిన్లో ప్లేట్లు కడుగుతున్న చప్పుడు వినపిస్తోంది.

కాబూలీ ఆరడుగులు పైనే వుంటాడు. అతని పాగాకి పది మూరల బట్ట కావాలి. అతని పైజమాకి పాతిక గజాలు కావాలి. అతనికి పూటకి పది పరోటాలూ, పూర్తి ప్లేటుపలావూ కావాలి.

పచ్చిమాంసం తిని అరిగించుకోగలిగిన మనిషిలా అతను బలంగా వుంటాడు. అతని మొహంలో పెట్టుబడి దారులకు వుండే ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది.

ఏడుకొండలవాడి దగ్గర వడ్డీ పుచ్చుకున్నప్పుడు కుంచం తిరగేలా కొల్చిన కుబేర నీతిలో అతనికి – అతను హిందువు కాకపోయినా – పూర్తి నమ్మకం వుంది.

నిలువు దోపులు పుచ్చుకునే వెంకటరమణమూర్తి వడ్డీలు మాత్రం కట్టగలిగి అసలు కట్టలేక కొండెక్కిపోయేడు. వడ్డీ లేని అప్పు అయినా తీర్చలేక స్మశానాలు పట్టిపోయేడు సత్యహరిశ్చంద్రుడు.

అప్పు ఆడదైనా చెయ్యగలదు. కాని అది తీర్చడం కంటే తనువుతో కైలాసం వెళ్ళడం సులువు.

"బాకీలు వసూలు చేసుకోడానికి కావలసింది కోర్టుకాదు కండ. బాకీ వసూలు చేసుకోవడానికి విశ్వామిత్రుడు వకీల్ని

పెట్టుకోలేదు. నక్షత్రకుడిని నియమించేడు. విశ్వామిత్రు డిలా కాకుండా వ్యాపారి స్వయంగా బైల్దేరితే మరీ మంచిది”

“మెలకువలు తెలిస్తే బాకీలు వసూలు చేసుకోవడం మంచి నీళ్ళప్రాయం. బాకీ తీర్చకపోతే తంతాననాలి. తన్నాలి. ఆఖరికి అప్పు చేసినవాడి కొడుకు చచ్చినా బాకీ కట్టందే శవాన్ని శ్మశానం చేరనివ్వననాలి. అప్పటికే చేర్చేస్తే కాల్చనివ్వననాలి. కాలిస్తే ఆర్పేస్తాననాలి.

ఇవి కాబూలీ నమ్మకాలు. అతను యిక్కడి ప్రజల సౌకర్యాం కోసం పెళ్ళాం పిల్లల్ని దూరదేశంలో వదిలి–వడ్డీ పుచ్చుకో కూడదన్న తనమత సిద్ధాంతాన్ని కూడా అతిక్రమించి – పెద్ద పెట్టుబడితోనే వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు.

అతన్ని ధైర్యంగానే అప్పు అడిగాడు విశ్వనాథం. అతనికి యిద్దామని వున్నా యివ్వనన్నాడు. ఇవ్వలేనన్నాడు. చేతిలో కానీ లేదన్నాడు. ఈవేళ బాకీ కట్టాల్సిన కనకం కాజువల్ లీవ్ పెట్టేసేడన్నాడు. కనకం గాడు ఖచ్చితమైన బద్మాష్ అన్నాడు. నన్ను కాదని ఎక్కడికి వెళ్తాడని ప్రశ్నించేడు. ఈవేళ కాకపోతే రేపైనా అతని చేత బాకీ కక్కిస్తానన్నాడు. “కల్‌మిలో” అని ఆశ చూపించేడు.

❖ ❖ ❖

అదే రాత్రి విశ్వనాథం తన దగ్గరున్న యాభై తీసి, కాబూలీ వాడు తనకు ఆ డబ్బు యివ్వడానికి ఎన్ని తిప్పలు పెట్టేడో, ఆఖరికి తను వాడి దగ్గర ఆ మొత్తం ఎలా పీకగలిగేడో వర్ణించి చెప్పి మరీ సత్యానికి యిచ్చేడు.

అదే రాత్రి ఆ యాభై రూపాయలూ సత్యనారాయణ, వెంక ట్రావు, వజీరుద్దీను, జార్జి చేతులు మారికనకారావుని చేరుకొనీ మర్నాటి ఉదయం కాబూలీ హస్తగతం అయి సాయంత్రానికి మళ్ళీ విశ్వనాథాన్ని చేరుకున్నాయి.

కాబూలీ దగ్గర డబ్బు పుచ్చుకొని జేబులో పెట్టుకుంటున్న ప్పుడు విశ్వనాథానికి ఏడుపులాంటి నవ్వు వచ్చింది.

**షరా :** కాబూలీ నెలకు రూపాయికి పది పైసలు వడ్డీ పుచ్చు కొనును.

**(యువ దీపావళి, 10.11.1968)**

# మావూరు

**మా** వూళ్లో రంకుతనాలు, రాజకీయాలు, లలితకళలు!’

మా వూళ్ళో.........

చీకటి రాత్రి ఆకాశం జిలుగుపైటలా వుంటుంది.

వెన్నెల రాత్రి చంద్రుడు వెండి జరీ పువ్వులా వుంటాడు.

కొంద రాడవాళ్లు కళ్లు ఆర్చి కొంపలార్పేస్తారు.

కళ్లు టపటప లాడించి కొంప లంటించేస్తారు.

శివాలయంలోనే సారాబట్టీ.

మసీదు పక్కనే ముండల కంపెనీ.

సారా, స్మగ్లింగు ముఖ్య పరిశ్రమలు.

సెక్సు, శవ సాహిత్యాలు ప్రత్యేక ప్రక్రియలు.

మిషను ఆస్పత్రిలో మందూ, మతమూ దొరుకుతాయి.

నాయకులకి డెక్కలు కూడా మొలిచేయి.

రంకుతనాలు, రాజకీయాలు లలిత కళలు.

జమీందారుగారి భవంతికి తూర్పుగా నాలుగు ఫర్లాంగుల్లో ఒక పెద్ద కాంపౌండు గోడవుంది. అది కోటగోడలా ఎత్తుగా; ధృడంగా వుంటుంది. దాని ఆవరణలోని చెట్లు సిమెంటు చెట్లలా బలంగా ధృడంగా వుంటాయి. వాటి నీడ పాకే విషపు పొరలా వుంటుంది. ఆ కాంపౌండులోని పూల మొక్కలు ప్లాస్టిక్ మొక్కల్లా అసహజ సౌందర్యం కలిగి వుంటాయి.

ఆ ఆవరణలో ఒక బంగళా వుంది. ఆ బంగళాలో ఖూనీ చేస్తే చచ్చినవాడి కేక రోడ్డుమీదకు వినిపించనంత దూరంగా వుందది. దానిమీద శ్మశానపు నిశ్శబ్ధం ఎప్పుడూ బరువుగా కూర్చున్నట్టుంటుంది. అందులోని నౌకర్లు నడిచే మైనపు బొమ్మల్లా ప్రాణరహితంగాను, నమ్రంగాను వుంటారు. ఆ బంగ ళాలో ఎందులోనూ చౌకతనం కన్పించదు, దాన్లో బాత్‌రూములు నీ బంగళా అంత వుంటాయి. దాన్లో రేడియోగ్రాం పందిరి మంచం అంత ఉంటుంది.

ఆ బంగళా రాజావారిది. రాజావారికి రాణీలు వున్నారు. కాని, వారు “రాజుగారు’ కారు. వారి తాతగారికి తురాయిపాగా లేదు. వారి తండ్రి గారికి రావు బహద్దూర్ వుండేది. వారు కొత్తరకం పాలకుల జాతికి (Ruler's caste) చెందినవారు.